కర్ణాటకలో బస్సు చార్జీల మోత?

- రవాణా అధికారులతో చర్చిస్తానన్న సీఎం సిద్ధరామయ్య
- బస్సు చార్జీలు పెంచి చాలా కాలం అయిందంటూ వ్యాఖ్య
- పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్ పెంపునకు సమర్థన

బెంగళూరు, జూన్ 18: కర్ణాటకలో ఇబ్బడిముబ్బడి హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ఆ 'ఐదు గ్యారెంటీ'లను అమలు చేసేందుకు ఆపసోపాలు పడుతున్నది. నిధుల కోసం సామాన్య ప్రజల జేబులను గుల్ల చేసే పని ప్రారంభించింది. ఇందులో భాగంగా పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను పెంచేసిన సిద్ధరామయ్య సర్కార్.. ఇప్పుడు బస్సు చార్జీలను కూడా పెంచే యోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. బస్సు చార్జీలను పెంచాలా? లేదా? అనే విషయంలో తాను రవాణా శాఖ అధికారులతో చర్చలు జరుపుతానని సీఎం సిద్ధరామయ్య సోమవారం మీడియాతో మాట్లాడుతూ పేర్కొన్నారు. బస్సు చార్జీలను పెంచి చాలా కాలం అయిందనే విధంగా ఆయన చెప్పుకొచ్చారు. 'చార్జీల పెంపు ప్రతిపాదన ప్రస్తుతానికి మా ముందు లేదు. కానీ దీనిపై రవాణా శాఖ అధికారులతో చర్చిస్తా' అని సీఎం పేర్కొన్నారు.

పన్నుల పెంపునకు సమర్థన

పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్ పెంపును సీఎం సిద్ధరామయ్య సమర్థించుకొన్నారు. జీఎస్టీ వచ్చినప్పటి నుంచి ఆదాయాలు పెంచుకొనే స్వేచ్ఛను రాష్ట్ర ప్రభుత్వాలు కోల్పోయాయని, రాష్ట్రాలకు ఇంధనం, లిక్కర్, స్టాంప్ డ్యూటీలు, మోటార్ వాహనాలు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. పన్నుల వాటా పంపిణీలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు.

ఏడాదిలో వరుస పన్నుల మోత

కర్ణాటకలో ఏడాది కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై పన్నుల మోత మోగిస్తున్నది. ఇప్పటికే గైడెన్స్ వ్యాల్యూ ట్యాక్స్, అదనపు ఎక్సైజ్ డ్యూటీ, రవాణా వాహనాలపై అదనపు సెస్, ఈవీలపై లైఫ్ టైమ్ ట్యాక్స్‌ను ఇబ్బడిముబ్బడిగా వసూలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను పెంచుతూ గత శనివారం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. పెట్రోల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను 25.92 నుంచి 29.84 శాతానికి (3.92 శాతం పెరుగుదల), డీజిల్‌పై 14.3 శాతం నుంచి 18.4 శాతానికి (4.1 శాతం పెరుగుదల) పెంచింది. దీంతో లీటర్ పెట్రోల్ ధర రూ.3, లీటర్ డీజిల్ ధర రూ.3.02 మేర పెరిగింది. దీనిపై సామాన్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంధన, నిత్యావసరాల ధరలతో అల్లాడుతుంటే.. మళ్లీ ఈ అదనపు వడ్డింపు ఏంటని కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీస్తున్నారు.

మళ్లీ పేపర్ బ్యాలెట్‌కు మళ్లాలి

ఈవీఎంలను రద్దు చేయాలి

హ్యాకింగ్ ఆరోపణలతో రాజకీయ వర్గాల్లో పెరుగుతున్న డిమాండ్

న్యూఢిల్లీ, జూన్ 18: ఈవీఎంల హ్యాకింగ్ ఆరోపణల నేపథ్యంలో ఎన్నికలను తిరిగి పేపర్ బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలనే డిమాండ్ పెరుగుతున్నది. ఈవీఎంల స్థానంలో తిరిగి బ్యాలెట్ పేపర్లను తీసుకురావాలని పలు పార్టీలకు చెందిన నేతలు డిమాండ్ చేస్తున్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంగళవారం ఎక్స్ వేదికగా ఈవీఎంలకు వ్యతిరేకంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. పేపర్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తేనే ప్రజాస్వామ్య నిజమైన స్ఫూర్తి నిలబడుతుందని అన్నారు. కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్ కూటమి అధిక ఎంపీ స్థానాలు గెలుచుకోవడంలో ఈవీఎంల పాత్ర ఉన్నదని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆరోపించారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు విముఖత వ్యక్తం చేస్తున్నదని మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే ప్రశ్నించారు. ఎన్నికలు పారదర్శకంగా జరుగతాయనే దానిపై ఈసీ ప్రజలకు హామీ ఇవ్వాలని శివసేన(యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది అన్నారు.

0.001% నిర్లక్ష్యమున్నా ఉపేక్షించరాదు

- నీట్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏకి సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- తప్పు జరిగుంటే ఒప్పుకోవాలని హితవు
- తదుపరి విచారణ జూలై 8కి వాయిదా
- ప్రధాని మోదీ మౌనంపై విపక్షాల ధ్వజం
- ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆప్ నిరసన
- సిలబస్ పరిధి దాటి ప్రశ్నలు ఇచ్చారన్న ఎన్టీఏ వాదనను తోసిపుచ్చిన ఎన్సీఈఆర్టీ

నీట్ పరీక్షలో అక్రమాలను నిరసిస్తూ ఢిల్లీలో ధర్నా చేస్తున్న ఆప్ మద్దతుదారులు

న్యూఢిల్లీ, జూన్ 18: దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్ యూజీ పరీక్ష వివాదంపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. నీట్ యూజీ-2024 పరీక్ష నిర్వహించే క్రమంలో ఎవరి వైపు నుంచి అయినా 0.001 శాతం నిర్లక్ష్యం ఉన్నా ఉపేక్షించకూడదని, దాన్ని సంపూర్ణంగా, సకాలంలో పరిష్కరించాల్సిన అవసరం ఉన్నదని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ), కేంద్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. నీట్ వంటి ప్రవేశ పరీక్షలకు అభ్యర్థులు ఎంతో కష్టపడి చదువుతారని, ఆ శ్రమను మర్చిపోకూడదని కోర్టు ఈ సందర్భంగా అభిప్రాయపడింది. ఒక వ్యవస్థను మోసం చేసిన వ్యక్తి డాక్టర్ అయితే.. సమాజానికి ఎంత హానికరమో ఊహించుకోవాలని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన వెకేషన్ బెంచ్ వ్యాఖ్యానించింది. మే 5న నిర్వహించిన నీట్ యూజీ పరీక్షలో పలువురు విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడం సహా పలు అంశాలపై దాఖలైన రెండు వేర్వేరు పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

అలా చేస్తేనే మీ పనితీరుపై విశ్వాసం!

విచారణ సందర్భంగా నీట్ పరీక్ష నిర్వహించిన ఎన్టీఏకు సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసింది. 'పరీక్ష నిర్వహణ బాధ్యత గల సంస్థగా.. న్యాయంగా ఉండాలి. తప్పు ఏదైనా జరిగితే, అవును తప్పు జరిగింది.. మేం ఈ చర్యలు తీసుకోబోతున్నాం అని చెప్పాలి. కనీసం అదైనా మీ పనితీరుపై విశ్వాసం కలిగిస్తుంది' అని న్యాయస్థానం ఎన్టీఏకు హితవు పలికింది. సకాలంలో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడిన కోర్టు.. తదుపరి విచారణను జూలై 8కు వాయిదా వేసింది. నీట్ యూజీ-2024 పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని కోరుతూ దాఖలైన పిటిషన్, ఇతర పెండింగ్ పిటిషన్లతో కలిసి ఆ రోజున విచారణ చేపడుతామని తెలిపింది. తాజా పిటిషన్లపై రెండు వారాల్లోగా స్పందన తెలియజేయాలని ఎన్టీఏ, కేంద్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీచేసింది. నీట్ పేపర్ లీకేజ్, అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరుపాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గత వారం కేంద్రం, ఎన్టీఏలకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా, నీట్ పరీక్షలో పలు చోట్ల అక్రమాలు జరుగడం వాస్తవమేనని, రెండు చోట్ల వెలుగులోకి వచ్చాయని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధరేంద్ర ప్రధాన్ తాజాగా అంగీకరించిన విషయం తెలిసిందే. ఎన్టీఏ ఉన్నతాధికారులైనా.. తప్పు చేసినట్టు తేలితే, ఎవరినీ వదిలేసే లేదని అన్నారు.

సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేయాలి

నీట్ పరీక్ష అక్రమాలకు వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టారు. నీట్ అవకతవకలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిందని, అభ్యర్థులు రోజుకు 16-18 గంటలపాటు ఎంతో కష్టపడి చదివారని పేర్కొన్నారు. పరీక్ష రాయడానికి ఎవరైనా లంచం ఇచ్చినట్టు ఇంతకు ముందు ఎప్పుడూ వినలేదని ఆయన అన్నారు. పరీక్ష జరిగిన మే 5కు ముందు రోజున బీహార్‌లో కొంత మంది విద్యార్థుల చేతికి నీట్ ప్రశ్నాపత్రం అందిన ఉదంతాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

విద్యార్థుల భవిష్యత్తుపైనా మౌనమేనా?

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నీట్ వివాదంపై ప్రధాని మోదీ మౌనంగా ఉండడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీహార్, గుజరాత్, హర్యానాలో జరిగిన అరెస్టులు నీట్ పరీక్షలో ఒక ప్రణాళిక ప్రకారం వ్యవస్థీకృత నేరం జరిగిందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు పేపర్ లీకేజీలకు కేంద్రంగా మారాయని ఆరోపించారు. 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన పరీక్షలో జరిగిన అక్రమాలపై ప్రధాని మోదీ తన దైన శైలిలో మౌనం పాటిస్తున్నారని విమర్శించారు. పేపర్ లీకులకు వ్యతిరేకంగా బలమైన పాలసీలు తీసుకొచ్చేలా యువత గొంతుకను వీధుల నుంచి పార్లమెంట్ వరకు వినిపిస్తామని రాహుల్ పేర్కొన్నారు.

ఎన్టీఏ వాదనను తోసిపుచ్చిన ఎన్సీఈఆర్టీ

నీట్ యూజీ-2024 పరీక్షలో సిలబస్ పరిధి దాటి ప్రశ్నలు ఇచ్చారన్న ఎన్టీఏ వాదనను నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎన్సీఈఆర్టీ) తోసిపుచ్చింది. ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లాని సోమవారం మైసూర్‌లోని రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఆర్ఐఈ)లో మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఏ ప్రకటనలో వాస్తవం లేదన్నారు. 2020 నుంచి ఎన్సీఈఆర్టీ రివైజ్డ్ పుస్తకాలు ప్రింట్, ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రశ్నలను రూపొందించిన వారు 2020 ముందు నాటి పుస్తకాలను ఎందుకు రిఫర్ చేశారో తమకు తెలియదని ఆయన తెలిపారు.

ఇంగ్లిష్ మీడియం స్కూళ్లపై మోజు ఆత్మహత్యా సదృశమే

ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ డీపీ సక్లానీ

న్యూఢిల్లీ: సరైన శిక్షణ పొందిన ఉపాధ్యాయులు లేనప్పటికీ చాలామంది తల్లిదండ్రులు ఇంగ్లిష్ మీడియం స్కూళ్ల వైపు ఆకర్షితులవుతున్నారని నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్సీఈఆర్టీ) డైరెక్టర్ డీపీ సక్లానీ పేర్కొన్నారు. ప్రభుత్వ బడుల్లోనూ నాణ్యమైన విద్య అందుతున్న ప్రస్తుత తరుణంలో ఇంగ్లిష్ మీడియం స్కూళ్లపై మక్కువ పెంచుకోవడం అంటే ఆత్మహత్యకు తక్కువేమీ కాదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఆంగ్లమాధ్యమ పాఠశాలలపై మక్కువ పెంచుకుంటున్నారని, తగినంత మంది ఉపాధ్యాయులు లేకున్నా, సరైన శిక్షణ లేకున్నా తమ పిల్లలను అలాంటి పాఠశాలలకు పంపేందుకు వారు ఇష్టపడుతున్నారని విమర్శించారు. ఆత్మహత్యకు ఇది ఎంతమాత్రమూ తక్కువ కాదని నొక్కి చెప్పారు. అందుకనే కొత్త (జాతీయ) విద్యా విధానం మాతృభాషలోనే పిల్లలకు విద్యాబోధన చేయాలని చెప్తున్నదని వివరించారు. మన మాతృభాషను, మూలాలను అర్థం చేసుకోలేనప్పుడు మిగతాది ఎలా అర్థమవుతుందని ఆయన ప్రశ్నించారు.

రాజకీయాల్లోకి నితీశ్ కుమారుడు!

బీహార్‌లో విస్తృత ప్రచారం

పట్నా: వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకినంటూ ప్రకటిస్తూ వస్తున్న బీహార్ సీఎం నితీశ్ కుమార్ కుమారుడు నిశాంత్ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నారంటూ ప్రచారం జరుగుతున్నది. గతంలో చాలా అరుదుగా మాత్రమే నిశాంత్ బహిరంగ కార్యక్రమాల్లో దర్శనం ఇచ్చేవారు. అయితే 73 ఏండ్ల నితీశ్ నాయకత్వం తర్వాత పార్టీకి వారసుడు ఎవరు? అని పార్టీ వర్గాల్లో చర్చ జరిగిందని, దాంతో నితీశ్‌కు వారసునిగా అతని కుమారుడిని రంగంలోకి దింపాలని పార్టీ వర్గాలు సూచించినట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ ప్రచారానికి నితీశ్ సహచరుడు విద్యానంద్ చేసిన ఓ పోస్టు మరింత ఊతమిచ్చింది. 'నేటి నవ రాజకీయ పరిస్థితులలో బీహార్‌కు యువ నాయకత్వం అవసరం. ఆ నాయకత్వ లక్షణాలన్నీ నిశాంత్ కుమార్‌లో ఉన్నాయి. ఇదే అభిప్రాయాన్ని జేడీ(యూ) పెద్దలకు తెలిపా' అని పేర్కొన్నారు. అయితే ఈ ప్రచారం అంతా ఆధారం లేనిదని మంత్రి విజయ్ కుమార్ కొట్టివేశారు.

కన్నడ నటుడు దర్శన్ మేనేజర్ ఆత్మహత్య

బెంగళూరు: హత్య కేసు విచారణ ఎదుర్కొంటున్న దర్శన్‌కు సంబంధించి మరో విషయం కలకలం సృష్టించింది. బెంగళూరులోని దర్శన్ ఫామ్‌హౌస్‌లో అతని మేనేజర్ శ్రీధర్ ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఈ ఆత్మహత్యపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. మేనేజర్ సూసైడ్ నోట్, వీడియో మెసేజ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒంటరితనాన్ని భరించలేకే ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన కుటుంబానికి సంబంధ లేదని స్పష్టం చేశాడు. అయితే వాస్తవానికి అతను చనిపోయింది ఈ రోజు కాదు ఈ ఏడాది ఏప్రిల్‌లోనని బెంగళూరు రూరల్ ఎస్పీ మల్లిఖార్జున్ స్పష్టం చేశారు. దర్శన్ ఫామ్‌హౌస్‌లో కాకుండా రెండు కిలోమీటర్ల దూరంలో ఆత్మహత్య చేసుకున్నట్టు న్యూస్ 18కు తెలిపారు.

కెనడా చదువులకు బైబై!

- భారీగా తగ్గిన భారతీయ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్
- వర్క్, స్టడీ వీసా జారీలో ఆ దేశ మార్పుల ప్రభావం
- ఇరు దేశాల సంబంధాలు దెబ్బతినడమూ కారణమే

న్యూఢిల్లీ, జూన్ 18: ఉన్నత చదువుల కోసం కెనడాకు వెళ్లేందుకు భారతీయ విద్యార్థులు ఇంతకు ముందులా ఆసక్తి చూపటం లేదు. స్టడీ, వర్క్ వీసా జారీల్లో కెనడా చేసిన మార్పులు, పెరిగిన ఆర్థిక భారం, వీసా జారీ ప్రక్రియ కఠినతరం చేయటం, భారత్-కెనడా దౌత్య సంబంధాలు దెబ్బతినటం.. ఇవన్నీ ప్రభావం చూపాయి. స్టడీ పర్మిట్లను ఆ దేశం 35 శాతం తగ్గించటం ఈ ఏడాది ఆరంభంలో భారతీయ విద్యార్థుల్ని తీవ్రంగా నిరాశపర్చింది. గత ఏడాది అక్టోబర్-డిసెంబర్ మధ్య స్టడీ పర్మిట్ల జారీ 86 శాతం వరకు తగ్గింది. అంతేగాక ఇప్పటికే ఆ దేశానికి చేరుకున్న మన విద్యార్థులు అక్కడ అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తున్నది. నూతన ఇమ్మిగ్రేషన్ పాలసీలో కెనడా చేసిన మార్పులు, తమ తల్లిదండ్రులపై మరింత ఆర్థికభారం మోపుతుందని భారతీయ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంత కష్టపడి ఇక్కడకు రావాల్సిన అసరం ఏముందని వారు ప్రశ్నిస్తున్నారు.

పంజాబ్, హర్యానా నుంచే అత్యధికం

కెనడాలోని అంతర్జాతీయ విద్యార్థుల్లో 41 శాతం భారత్ నుంచి వచ్చినవారే ఉన్నారు. ఆ దేశ ఆర్థిక వృద్ధిలో అంతర్జాతీయ విద్యార్థులది కీలక పాత్ర. ప్రతిఏటా పంజాబ్, హర్యానా నుంచి అత్యధికమంది విద్యార్థులు కెనడాకు వెళ్తుంటారు. ఒక్క పంజాబ్ రాష్ట్రం కెనడా చదువుల కోసం రూ.60 వేల కోట్లు ఖర్చు చేస్తున్నదని ఒక అంచనా! అయితే, అంతర్జాతీయ విద్యార్థుల రాకతో కెనడా జాబ్ మార్కెట్లో పోటీ పెరిగింది. ఇండ్ల ధరలు, వాటి కిరాయిలు భారీగా పెరిగాయి. ఖలిస్థాన్ వేర్పాటువాదం భారత్‌తో సంబంధాల్ని దెబ్బతీసింది. కెనడా తన స్టడీ, వర్క్ వీసా విధానాల మార్పునకు ఇవి దారితీశాయని నిపుణులు చెబుతున్నారు. వారానికి గరిష్టంగా 24 గంటలు మాత్రమే క్యాంపస్ బయట పనిచేసుకునేలా ట్రూడో సర్కారు నిబంధనల్ని మార్చింది.

భారత విద్యార్థుల నిరసనలు

కొత్త వలస విధానంలో కెనడా చేసిన మార్పులపై ఆ దేశంలో ఉంటున్న భారతీయ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం 'ప్రిన్స్ ఎడ్వార్డ్ ఐలాండ్' (పీఈఐ)లోని విద్యార్థులు 'బిగ్ బ్లాకౌట్'కు పిలుపునిచ్చారు. తమను బలవంతంగా దేశం నుంచి వెళ్లగొట్టేందుకు కొత్త వలస విధానంలో మార్పులు చేసినట్టు వారు ఆరోపిస్తున్నారు. విద్య, పని అనుభవం ఉన్న కార్మికులకు 'పీఎన్‌పీ' (ప్రావిన్షియల్ నామినీ ప్రోగ్రామ్) కింద వీసాలు జారీచేస్తారు. ఇది పీఈఐలో జూన్ 20న అధికారులు నిర్వహిస్తున్నారు. గురువారం నామినేషన్ల డ్రా చేపట్టనున్నారు. దీని కంటే ఒక రోజు ముందు పీఈఐలో విద్యార్థులు నిరసనకు పిలుపునివ్వటం గమనార్హం.

ప్రారంభానికి ముందే కూలిన వంతెన

బీహార్‌లో నాలుగు నెలల్లో రెండో ఘటన

డబుల్ ట్రబుల్ | ఇంజిన్

అరారియా: బీజేపీ-జేడీయూ కూటమి పాలనలోని బీహార్‌లో మరో వంతెన ప్రారంభానికి ముందే కుప్ప కూలింది. అరారియా జిల్లాలోని పరారియా గ్రామంలో ఈ ఘటన జరిగింది. అయితే అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. రూ.12 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఈ వంతెనలో అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని ఇంకా చేపట్టలేదు. దీంతో ఈ వంతెనపై ప్రజా రవాణాకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. బక్రా నదిపై కుర్సా కంటా, స్కిటీ ప్రాంతాలను కలుపుతూ ఈ బ్రిడ్జిని నిర్మించారు. బ్రిడ్జి కూలడానికి గల కారణాలపై అధికారులు విచారణ జరుపుతున్నారని అరారియా ఎస్పీ అమిత్ రంజన్ తెలిపారు. ఈ సంవత్సరం మార్చి నెలలో కోసి నదిపై నిర్మిస్తున్న వంతెన కూలి పది మంది గాయపడ్డారు.

ఢిల్లీ విమానాశ్రయంలో లగేజ్ సెల్ఫ్ చెక్-ఇన్

న్యూఢిల్లీ: దూర ప్రయాణమంటేనే పెద్ద లగేజీ ఉంటుంది. విమానాశ్రయాల్లో వీటి చెక్-ఇన్ పెద్ద ప్రహసనంలా సాగుతుంది. అయితే ప్రయాణికుల సౌలభ్యం కోసం దేశంలోనే మొట్టమొదటిసారిగా ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో సోమవారం నుంచి 'సెల్ఫ్ చెక్-ఇన్' సర్వీసు అమల్లోకి వచ్చింది. ఇంతకు ముందులా కాకుండా, లగేజ్ చెక్-ఇన్‌ను తక్కువ సమయంలో పూర్తి చేసేలా 50 'సెల్ఫ్ సర్వీస్ బ్యాగ్ డ్రాప్' యూనిట్లను విమానాశ్రయంలో ఏర్పాటుచేశారు. ఈ యూనిట్ల వద్ద ప్రయాణికులు తమంతట తామే లగేజ్ చెక్-ఇన్‌ను పూర్తిచేయవచ్చు. వాటి ట్యాగ్‌లు, బోర్డింగ్ పాస్‌లను ప్రింట్ తీసుకొని విమానంలోకి అడుగుపెట్టడమే తరువాయి. సెల్ఫ్ చెక్-ఇన్ వ్యవస్థను తొలుత కెనడాలోని టొరంటో ఎయిర్‌పోర్ట్‌లో తీసుకొచ్చారు. ఆ తర్వాత దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు దక్కుతుంది.

భారత్‌లో గూగుల్ జెమిని యాప్

న్యూఢిల్లీ: తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సహా 9 భారతీయ భాషల్లో సపోర్ట్ చేసే 'ఏఐ అసిస్టెంట్ జెమిని' యాప్‌ను గూగుల్ భారత్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రీమియం వెర్షన్ 'జెమిని అడ్వాన్స్‌డ్'లో అనేక కొత్త ఫీచర్లను జోడించింది. కొంత మొత్తం చెల్లించటం ద్వారా 'జెమిని 1.5 ప్రో'లోని సరికొత్త ఫీచర్లు యూజర్లు పొందవచ్చునని తెలిపింది. గత ఏడాది చివర్లో 'జెమిని' పేరుతో అత్యంత అడ్వాన్స్‌డ్ వెర్షన్ ఏఐ టూల్‌ను గూగుల్ పరిచయం చేసింది. ఇందులో క్రమేణా పలు ఫీచర్లను జోడిస్తూ వచ్చింది. మరికొద్ది వారాల్లో భారత్‌లోని 'ఇఫోన్' యూజర్లకు కూడా ఏఐ టూల్ అందుబాటులోకి వస్తుందని సంస్థ ఇంజనీరింగ్ విభాగం వైస్ ప్రెసిడెంట్ సుబ్రమణ్య వెల్లడించారు. ప్రజల ఉత్పాదకత, అభ్యాసం, సృజనాత్మకత మెరుగుపర్చడానికి 'ఏఐ అసిస్టెంట్ జెమిని' సామర్థ్యాలు దోహదపడతాయని ఆయన చెప్పారు.

భవిష్యత్తు బ్రెయిన్ చిప్‌లదే

ఫోన్లు ఉనికిలో ఉండవంటున్న ఎలాన్ మస్క్

న్యూఢిల్లీ, జూన్ 18: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచం శరవేగంగా పరుగులు తీస్తున్నది. దీంతో మనిషి జీవనశైలి సమూలంగా మారిపోతున్నది. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్లు మన జీవితాల్లో ఎన్నో మార్పులు తీసుకొచ్చాయి. కానీ, భవిష్యత్తులో ఫోన్లు మనుగడలో ఉండవట. వాటి స్థానంలో ఎలక్ట్రానిక్ బ్రెయిన్ చిప్‌లు ఉనికిలోకి వస్తాయని ప్రపంచ కుబేరుడు, టెస్లా సంస్థ అధిపతి ఎలాన్ మస్క్ చెప్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మస్క్‌కు చెందిన న్యూరాలింక్ కంపెనీ ఇటీవల ఓ మనిషి మెదడులో తొలిసారి విజయవంతంగా ఓ ఎలక్ట్రానిక్ చిప్‌ను అమర్చింది. ప్రమాదం వల్ల మెడ కింది భాగమంతా చచ్చుబడిపోయిన నోలాండ్ అర్బాగ్ (29) అనే వ్యక్తికి ఈ ఏడాది జనవరి 28న ఈ బ్రెయిన్ చిప్‌ను అమర్చారు. ఈ సర్జరీ జరిగి 100 రోజులు పూర్తవడంతో అర్బాగ్ ఆరోగ్య పురోగతికి సంబంధించిన సమగ్ర వివరాలను న్యూరాలింక్ కంపెనీతోపాటు ఎలాన్ మస్క్ వివిధ ట్వీట్లలో వెల్లడించారు. భవిష్యత్తులో ఎవరి వద్దా ఫోన్లు ఉండబోవని, వాటి స్థానంలో న్యూరాలింక్‌లు ఆధిపత్యం చెలాయిస్తాయని తెలిపారు. న్యూరాలింక్ అనేది తమ టెలీపతి సైబర్‌నెటిక్ బ్రెయిన్ ఇంప్లాంట్ అని, ఇది కేవలం ఆలోచనల ద్వారానే మన ఫోన్లను కంప్యూటర్లను నియంత్రించేందుకు వీలుకల్పిస్తుందని వివరించారు. ఈ బ్రెయిన్ చిప్‌ను అమర్చిన తర్వాత అర్బాగ్ ఎవరి సాయం లేకుండా తన పనులను తానే చేసుకోగలుగుతున్నాడని, చెస్, వీడియో గేమ్‌లను సైతం ఆడగలుగుతున్నాడని పేర్కొంటూ.. అందుకు సంబంధించిన వీడియోలను షేర్ చేశారు.

దేశవ్యాప్తంగా జియో సేవలకు అంతరాయం

న్యూఢిల్లీ, జూన్ 18: దేశవ్యాప్తంగా రిలయన్స్ జియో సేవల్లో అంతరాయం ఏర్పడింది. మొబైల్ కనెక్టివిటీ, జియో ఫైబర్ సేవల్లోనూ సమస్యలు ఉన్నాయని సోషల్ మీడియాలో వినియోగదారులు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌షాట్, యూట్యూబ్, గూగుల్ సెర్చ్ వంటి ప్రముఖ యాప్‌లను యాక్సెస్ చేయలేకపోతున్నామని, తమకు ఎదురవుతున్న అసౌకర్యంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. జియో ఫైబర్ సమస్యలను 58 శాతం, మొబైల్ ఇంటర్నెట్ కనెక్టివిటీ సమస్యలను 36 శాతం, మొబైల్ నెట్‌వర్క్ సమస్యలను ఏడు శాతం మంది వినియోగదారులు ఎదుర్కొంటున్నారు. ఇంటర్నెట్ రాకపోవడంపై జియో కస్టమర్ కేర్‌కు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని మరికొందరు వాపోయారు. అయితే, సేవల అంతరాయంపై జియో ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

పీఎం కిసాన్ నిధుల విడుదల

వారణాసి: ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత వాయిదా సొమ్ము 20 వేల కోట్ల రూపాయల నిధులను ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం విడుదల చేశారు. లోక్‌సభ ఎన్నికలైన తర్వాత తొలిసారిగా ప్రధాని వారణాసిని సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కిసాన్ సమ్మాన్ సమ్మేళనంలో 9.26 కోట్ల మంది రైతులు లబ్ధి చేకూరే నిధులను నేరుగా వారి ఖాతాల్లోకి విడుదల చేశారు.

స్టాక్‌మార్కెట్ మ్యానిపులేషన్‌పై

దర్యాప్తు చేయాలి

సెబీని కోరిన టీఎంసీ ఎంపీలు

ముంబై: ఈనెల ఆరంభంలో ఎగ